క్లుప్తంగా

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించను న్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించాలి. భక్తులు యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. అనంతరం ఆ ఆన్‌లైన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలని ఆలయ అధికారులు కోరారు.

పేదలకు అన్నదానం



వృద్ధులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్: శోభకృత్ నామ ఉగాది పండగ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు వేగి సన్యాసినాయుడు, వేగి మహాలక్ష్మి జ్ఞాపకార్థం కువైట్‌లో ఉంటున్న వారి కుమారుడు రామకృష్ణ బుధవారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులు, పేదలకు ఉదయం అల్పాహారం, రాత్రి అన్నదానం చేశారు. వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

వర్షపు నీటి నిల్వతో ఇక్కట్లు



బీఆర్ రెడ్డి జంక్షన్‌లో వర్షపు నీటిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అల్లిపురం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అల్లిపురంలో లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. అల్లిపురం, బీర్ రెడ్డి జంక్షన్‌లోని పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జంక్షన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నీరు నిలిచిపోయింది. దీంతో సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నీరు బయటకు పోయే మార్గం లేక ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ గోడ కూలిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి తక్షణమే రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ అన్నసంతర్పణ



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: అన్నిదానాలు కంటే అన్నదానం మిన్న అని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని చిన్న దుర్గాలమ్మ ఆలయం వద్ద భారీ సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు భాస్కరరావు అన్నదానం చేశారు.ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో అన్నదానం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో బుధవారం ఉగాది ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అన్నదానం ప్రారంభించి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భక్తులు, పేదలకు ప్రత్యేక అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయిబాబాకు భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం చేశారు.

అంతటా 'శోభా'యమానం

- ఘనంగా శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో నీలమ్మవేపచెట్టు అమ్మవారు



వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



నీలమ్మవేపచెట్టు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

అల్లిపురం: శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు దక్షిణ నియోజకవర్గంలో అంబరాన్ని తాకాయి. దేవాలయాలు మామిడి తోరణాలు, పుష్పాలంకరణతో కళకళలాడాయి. నూతన సంవత్సరం శోభాయమానంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అల్లిపురం, వెంకటేశ్వరమెట్టపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అలమేలు మంగమ్మ ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, సాయిబాబా దేవాలయాలలో దర్శనాలకు భక్తులు బారులు తీరారు. బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం మండపంలో ఉత్సవ విగ్రహాలు కొలువు దీర్చి, విశేష పూజలు నిర్వహించారు. దేవాలయాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

- అస్సాంగార్డెన్స్‌లోని నీలమ్మవేపచెట్టు అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు జోగారావు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా అందజేశారు.
- శ్రీ షిరిడీ సాయి ధ్యాన మందిరంలో సాయిబాబాను ఆలయ కమిటీ ప్రతినిధులు విశేషంగా అలంకరించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు.
- వెంకటేశ్వరమెట్ట వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో గౌరీ పరమేశ్వరులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

పాపాహోమ్‌లో..

డాబాగార్డెన్స్: పాపాహోం, భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పాపాహోం ప్రాంగణంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, కార్యదర్శి వి.హేమచంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. డాక్టర్ పి.కృష్ణకిరణ్‌శర్మ పంచాంగ శ్రవణం చేస్తూ శోభకృత్ నామ సంవత్సరం శోభాయమానంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, ఆర్సీ జైన్, ఎంవీ సత్యనారాయణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పాపాహోం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విశేష అలంకరణలో అచ్చియ్యమ్మపేట సాయిబాబా



ప్రత్యేక అలంకరణలో గౌరీ పరమేశ్వరులు



పంచాంగం వినిపిస్తున్న డాక్టర్ కృష్ణకిరణ్‌శర్మ

వేడుకగా సీతారాముల పెళ్లి రాట



29వ వార్డు దిబ్బలపాలెంలో రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



బంగారుమెట్టలో పెళ్లి రాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: మహారాణిపేట దిబ్బలపాలెంలో సీతారామచంద్రుల పెళ్లిరాట కార్యక్రమం బుధవారం వేడుకగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవంలో భాగంగా సీతారామ సేవా కమిటీ ఆధ్వర్యంలో పెట్టి రాట వేశారు. సేవా కమిటీ అధ్యక్షుడు చందక అప్పలరాజు మాట్లాడుతూ ఈ నెల 30న సీతారామ కల్యాణం నిర్వహిస్తామని, సాయంత్రం సీతారామ చంద్రుల ఊరేగింపు ఉంటుదని చెప్పారు. కమిటీ ప్రతినిధులు పసగాడ రామలింగేశ్వరరావు, చందక ప్రభాకరరావు, శ్రీనివాసరావు, సోర్నపూడి సంజీవ రావు, లక్ష్మణరావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో సీతారామచంద్రుల పెళ్లి రాట వైభవంగా నిర్వహించారు. పాతనగరం కోటవీధి రామాలయం, ఫిషింగ్ హార్బర్ రోడ్డు పెయిన్‌దొరపేట రామాలయం, చెంగల్రావుపేట, ఘోషాసుపత్రి వద్ద సీతారామస్వామి ఆలయం, వన్‌టౌన్ పప్పులవీధి రామాలయం, సూర్యాబాగ్ ఉమా రామలింగేశ్వరాలయం, గొల్లలపాలెం ఉమా రామ లింగేశ్వరాలయం, విశ్వనాథ్‌రోడ్డులోని ఓంకారేశ్వర ఆలయం, ప్రకాశరావుపేట రామాలయం, రామజోగిపేటలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉగాది సందర్భంగా ఆయా ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

అల్లిపురం: సీతారాముల కల్యాణ రాట మహోత్సవం బంగారుమెట్టలో శ్రీరామ ఆంధ్రయువజన సమాజం, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పిల్లా సూకరాజు, పార్వతి దంపతులు పెళ్లి రాటకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు, ఉత్సవ కమిటీ సభ్యులు భీశెట్టి గోపీకృష్ణ, భీశెట్టి రాజు, మద్దాల వెంకట అప్పారావు, మద్దాల వెంకటరావు, బంగారుమెట్ట ప్రజలు పాల్గొన్నారు.

సీబీఎం యూపీ స్కూల్‌కు వితరణ

అల్లిపురం: వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా బుధవారం షిర్డీ సాయిబాబా ఆలయంలో గోసేవ నిర్వహించారు. అనంతరం బంగారుమెట్ట సీబీఎం యూపీ స్కూల్‌కు రీజనల్ చైర్‌పర్సన్ వి.వి.రమణమూర్తి ఒక గ్యాస్ స్టౌ, గ్రీన్ చాక్ బోర్డు అందజేశారు. అనంతరం సూపర్‌బజార్ వద్ద ఉన్న పూర్ణానంద సమాజంలో నాగవరపు సీతారామ శర్మతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అల్లిపురం శాఖ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, మాజీ ప్రెసిడెంట్ ఎస్.విట్టల్ కుమార్, రీజనల్ సెక్రటరీ బీవీఎల్ కుమార్, ట్రెజరర్ పీవీఎస్ఆర్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ డీవీ సత్యానంద్ గుప్తా పాల్గొన్నారు.



గ్యాస్ స్టౌ, గ్రీన్ చాక్‌బోర్డు అందజేస్తున్న వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ప్రతినిధులు

ఎర్నిమాంబ ఆలయానికి గ్యాస్ స్టౌ అందజేత

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయానికి గవర దేవుడు జ్ఞాపకార్థం గవర రమణలక్ష్మి దంపతులు గ్యాస్ స్టౌ, 2 గ్యాస్ సిలిండర్లను అందజేశారు. అమ్మవారి నైవేద్యం, కైంకర్యం నిమిత్తం దీనిని వినియోగించాలని నిర్వాహకులను కోరారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబా, అర్చకులు శ్రీకాంత్ శర్మకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో నమ్మి రాజగోపాల్, పైడి ప్రసాద్, రామకృష్ణ, విజయ, అప్పారావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ బుక్ అందజేస్తున్న రమణలక్ష్మి

పేదలకు దుప్పట్ల పంపిణీ



చిన్నారులతో ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ జన్మదిన వేడుకలు సందర్భంగా బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాత నగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ముందుగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం సంస్థ ట్యూషన్ విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తరువాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, అధ్యక్షుడు సూరాడ అప్పారావు, వుడా మాజీ చైర్మన్ రవి, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, ఇతర ప్రముఖులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో పోర్ట్ సాంస్కృతిక సంస్థ సాగరి ఆధ్వర్యంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి పోర్ట్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఆర్.ఎస్.హరికృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోర్ట్ రిటైర్డ్ హిందీ అధికారి పి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పి.ఫ్రాన్సిస్ కవి సమ్మేళనాన్ని నిర్వహించగా.. ప్రముఖ కవి డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ప్రముఖ వ్యాఖ్యాత పి.అభిషేక్‌ను ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త, పంచాంగ కర్త అడబాల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. 40 మంది కవులు, కవయిత్రులు కవితలను వినిపించారు. పోర్ట్ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ ఆర్ రాములు, సాగరి వైస్ ప్రెసిడెంట్ అవతారం నాయుడు, కార్యదర్శి ధర్మారావు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, చంద్రరావు, సత్యారావు, సూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

అప్పన్న కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు



ఏఈఓకు తలంబ్రాలు అందజేస్తున్న దాత

సింహాచలం: వచ్చే నెల 2న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన విజయలక్ష్మి డైమండ్స్ అధినేత శివశంకర్‌రాజు రూ.90వేలు విలువ చేసే ముత్యాల తలంబ్రాలు అందజేశారు. సింహగిరిపై ఆలయంలో ఏఈవో నరసింహరాజుకు వాటిని అందజేశారు.

మార్కెట్ లోపలికి వెళ్లేదెలా?



పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద అడ్డుగా పార్క్ చేసిన వాహనాలు

జగదాంబ: పూర్ణామార్కెట్ లోపలికి వెళ్లే మార్గంలో రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేయడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. పూర్ణామార్కెట్‌కు వెనుక పండుపుల్లల సందు వైపు ఉన్న గేటు వద్ద అనధికార పార్కింగ్, రహదారుల పైకి దుకాణాలు పెట్టడంతో రాకపోకలు కష్టమవుతున్నాయి. కనీసం నడిచివెళ్లే దారి కూడా వదలకపోవడం వలన లోపలికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి ప్రధాన గేట్లపై వెళ్లవలసి వస్తుందని చెబుతున్నారు. నిత్యం ఇదే విధంగా ఉంటోందని ఆరోపించారు. ఒక వేళ వెళ్లినా ముందు వెళ్లి పార్క్ చేసుకున్న వాహనం తిరిగి రావాలంటే వెనుక పెట్టిన వాహనాలు అడ్డు ఉండటంతో గంటల తరబడి ఎండలో ఉండాల్సి వస్తుందన్నారు. దీని వలన తరచూ ఈ గేటు వద్ద తగాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుని వెంటనే గేటు వద్ద అనధికార పార్కింగ్ తొలగించి, రాకపోకలకు దారినివ్వాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

సామాన్యులకు నటనలో శిక్షణ

సీతంపేట: సామాన్యులకు నటనలో శిక్షణ ఇవ్వాలనే సదుద్దేశంతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించామని డైరెక్టర్ ఎస్.టి.నాయుడు తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద షిర్డీసాయి స్కూల్ ఎదురుగా డాక్టర్ ఎస్.టి.నాయుడు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, డ్యాన్స్ అకాడమీలను బుధవారం ఆయన ప్రారంభించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటనపై ఎంతోమందికి ఆసక్తి ఉన్నా ఆర్థిక స్తోమత లేక చాలా మంది వెనుకంజ వేస్తున్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో నటనలో శిక్షణ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని విశాఖ నగరంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ సంస్థలో యాక్టింగ్, స్క్రిప్ట్ రైటింగ్, యాంకరింగ్, డైరక్షన్, డ్యాన్స్‌ల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. మూడు నెలలు థియరీ, మరో మూడు నెలలు హైదరాబాద్‌లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన నటీనటులతో సొంతంగా సినిమా నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 85558 40515 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ నాయుడు కోరారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ కె.జయలక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాయుడు

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సింహాచలం: పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రైల్వే పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు విశాఖ జీఆర్‌పీ ఎస్ఐ బి.కామేశ్వరరావు తెలిపారు. సుమారు 75 ఏళ్ల ఉన్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతిచెందినట్టు తెలిపారు. నీలం రంగు నిక్కర్, కనకాంబరం రంగు హాఫ్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్న వ్యక్తి మొలతాడుకు బీరువా తాళం చెవి ఆకారం కలిగిన తాళాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 8985752107 నంబరులో సంప్రదించాలని కోరారు.



మృతుడు

ఉగాది పచ్చడి పంపిణీ



గ్రంథాలయం ఆవరణలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

అల్లిపురం: ఉగాది పండగ సందర్భంగా ఆలయాల వద్ద, గ్రామ సంఘాల వద్ద ఉగాది పచ్చడి విరివిగా పంపిణీ చేశారు. నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం వద్ద దేవస్థానం చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, కమిటీ సభ్యులు భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు. వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి నరసింహమూర్తి, కమిటీ సభ్యులు ఉగాది పచ్చడి పంచిపెట్టారు.

సమరయోధులకు కాగడాలతో నివాళి

బీచ్ రోడ్డు: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పౌర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శనతో నివాళులర్పించారు. బుధవారం ఆర్కేబీచ్ నుంచి కురుసుర సబ్‌మెరైన్ దగ్గర ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.



తీరంలో కాగడాలతో నివాళులర్పిస్తున్న పౌర, ప్రజా సంఘాల సభ్యులు

వైభవ వేంకటేశ్వరుడికి విశేష పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ చేసి రజిత కవచధారుడిగా అలంకరించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలన్నీ కోలాహలంగా మారాయి. మురళీనగర్ మహిళలు కోలాటమాడి ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం 600 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు శేషు స్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. భక్తులు తమ పేరు బలాలు, ఆదాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామికి విశేష హారతి సమర్పించారు. ఆలయం ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కోలాటమాడుతున్న మురళీనగర్ మహిళలు

ఆకట్టుకున్న కార్టూన్లు

మురళీనగర్: ఉగాది సందర్భంగా మురళీనగర్ టెన్నిస్ పార్కులో స్పోర్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఉత్తరాంధ్ర కార్టూనిస్టుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం కార్టూన్ల ప్రదర్శన నిర్వహించారు. వివిధ రంగాలతో పాటు సమకాలీన అంశాలను ప్రతిబింబిస్తూ కార్టూనిస్టులు వేసిన కార్టూన్లు ఆకట్టుకున్నాయి. కార్టూనిస్టులు రామశర్మ, వందన శ్రీనివాస్, టీఆర్ బాబు, వర్మలాల్ వేసిన కార్టూన్లు ప్రదర్శనలో ఉంచారు. చిన్నారులు అత్యధికంగా పాల్గొని ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కార్టూనిస్టులను సత్కరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఉంచిన కార్టూన్లు

కిటకిటలాడిన రైతుబజార్



సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారుల రద్దీ

సీతమ్మధార: ఉగాది పండగ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. పువ్వులు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటిపళ్లు, చెరుకుగడలు, వేపపువ్వు, మామిడి కాయలు ఇలా పూజ సామగ్రి కొనుగోలు చేశారు. రైతుబజార్ సహాయకుడు సతీష్ సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు జరగకుండా పర్యవేక్షించారు. బజారు మొత్తం వినియోగదారులతో నిండిపోవడంతో జేబు దొంగలు చేతివాటం చూపారు. ఒక వ్యక్తి జేబులోంచి రూ.10 వేలు దొంగిలించారు. దీంతో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు.